# కన్నీటి ముత్యాలు

"కెవ్వు"మని వినిపించిన స్త్రీ ఆర్తనాదంతో అదే దారిన జీప్ నడుపు కుంటూ ఒంటరిగా వెళ్ళుతున్న మురళీధర్ సడన్‌బ్రేక్ వేసి, జీప్ దిగాడు.

దాపులోనే చిన్నవి, పెద్దవి కలసిన తాటిచెట్ల గుంపు ఆ గుబురు వెనక నుండి ఓ స్త్రీ మూలుగు....

"ఎవరక్కడ?" మురళీధర్ కేక సమీపంలోవున్న కొండల్లో ప్రతి ధ్వనించింది. ఆ శబ్దానికి పడమట అస్తమిస్తున్న జగచ్చక్షువు భయపడి, పూర్తిగా అదృశ్యమయ్యాడు.

"ఉహుం.... ఊం.... ఉహుం...." స్త్రీ ప్రతిఘటన లీలగా విని పిస్తోంది.

జీప్‌లోంచి "ఇనుపకడ్డీ"ని చేతికి తీసుకుని, ఆ దిశకు పరుగెత్తాడు మురళీధర్.

తాటిచెట్ల గుంపు వెనుక జరుగుతున్న అమానుషం చూసి, 'ఆగు' అని గర్జించాడు.

ఆడపులిలా తిరగబడి పెనుగులాడుతున్న స్త్రీని దూరంగా నేల మీదికి నిర్దాక్షిణ్యంగా తోశాడావ్యక్తి. దృఢమైన శరీరంతో ఆజాను బాహుడైన మురళీధర్‌ను చూసి, కాస్త జంకి, "ఛూ! నీ యమ్మ! ఎలా లొంగవో చూస్తాను" అంటూ బండ బూతులు తిడుతూ, గుబురు చెట్లలోకి మాయమయాడా దానవుడు.

పదహారేళ్ళు కూడా నిండని ఆపల్లె పడుచు తలముడి వీడిపోయింది. చినిగిపోయిన రవికతో వక్షం నగ్నంగా వుంది చేతుల గాజులు చిట్లి, అంతా రక్తం....

లేచి, సిగ్గుకూడా మరచి, చేతులు జోడిస్తూ, "బాబూ!" అంటూ మురళీధర్ పాదాల మీద వాలిపోయింది కృతజ్ఞత నిండిన అశ్రువులతో.

ఆ దారుణ దృశ్యానికి ప్రేక్షకుడైన మురళీధర్ మనసు ఆర్ద్రమైంది. ఓ క్షణం అచేతనంగా నిలుచుండిపోయాడు. ఆ తరవాత జీపులోవున్న టవల్ తెచ్చాడు.

యౌవనాన్ని దాచుకుంటూ మోకాళ్ళ మీద తల పెట్టుకుని, లోకం లోని శోకానికి ప్రతినిధిలా కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది ఆమె!

మురళీధర్ ఆ టవల్ ఆమెపై కప్పి, "లేవండి" అన్నాడు అనునయంగా.

ఆమె దుఃఖాన్ని చూడలేదన్నట్లు తమలో కలిపేసుకుందామన్న ఆత్రతతో.... నలు దెసల నుండి చీకట్లు ముసురుకుంటున్నాయి

ఆమె బలవంతంగా ఏడుపు దిగమింగుకుంటూ ఆ టవల్‌లో తన శరీరాన్ని దాచుకుంటూ లేచి నిలుచుంది. "మీకేం భయం లేదు, రండి." జీపు వైపు దారి తీశాడు. వెక్కుతూనే అతణ్ణి అనుసరించింది ఆమె!

జీపు దరికి వెళ్ళాక, "మీ దే ఊరు?" అని ఇంకా భయంతో వణికిపోతున్న ఆమెను అడిగాడు మురళీధర్.

"ఎర్రమట్టివాగు ఇంద్రిగ" ఎక్కిళ్ళ మధ్య ఆమె జవాబు.

"నేనూ అక్కడికే! జీపు ఎక్కండి తీసుకెళ్ళి దింపుతాను."

"వద్దు—బాబూ! దేవుళ్ళా వచ్చి నన్ను కాపాడారు. మీ మేలు ఈ జన్మలో మరిచిపోను." రెండు చేతులు ఎత్తి నమస్కరించింది టవల్ జారిపోయింది. గబుక్కున వంగి, అందుకుని మళ్ళీ నిండుగా కప్పుకుంది.

చీకట్లు పూర్తిగా ఆవరించాయి.

"చూడండి! చీకటిగా వుంది. అదీగాక ఆ దుర్మార్గుడు ఇక్కడెక్కడో నక్కి వుంటే, మీరు మళ్ళీ ప్రమాదంలో చిక్కుకుంటారు. నన్ను నమ్మండి. నా మాట వినండి. మీ యింటి దగ్గర దించుతాను. రండి."

ఓ క్షణం ఆలోచించి, ఆ తరువాత టాప్‌లేని ఆ జీప్ వెనుక సీటులో ఎక్కి, బిక్కు బిక్కుమంటూ కూర్చుంది. జీప్ మెల్లగా బయలుదేరింది.

* * * *

ఆమె భయం నుండి కాస్త విముక్తి అయిందని అనుకున్నాక అడిగాడు మురళీధర్. "మీరిక్కడికెలా వచ్చారు? అసలేమయింది? మీకు ఎవరూ లేరా?". సన్నగా ఏడుస్తూ, మధ్యలో వెక్కుతూ— "నాన్న చని పోయి నెలరోజులు కూడా కాలేదు. అమ్మ జబ్బుతో మంచంలో ఉంది. మూసిన కన్ను తెరవడం లేదు. పూట జరగడం లేదు. అందుకే ఈవేళ మొదటిసారిగా కూలికి వస్తే కామందుగారి కొడుకు ఇలా చేశాడు." చెప్పింది.

"మీతోబాటు కూలీలు మరెవ్వరూ రాలేదా?"

"వచ్చారు. వాళ్ళు లెక్క ప్రకారం.... నాలుగు బార్ల పొద్దుతోనే వెళ్ళిపోయారు."

"మరి, మీరూ వారితో బాటే ఎందుకు వెళ్ళలేదు?"

ఆత్మీయుడు దొరికినట్లు, గుండె విప్పి అతని ముందు పరిచింది ఆమె. "మా నాన్న ఆ కామందుగారింట్లో వెట్టి చాకిరి చేసేవాడు. పెళ్ళి కని నాన్న వారి దగ్గర రెండు వందలు అప్పు చేశాడట. వడ్డీ, మొదలు

కలిసి ఇప్పటికి వెయ్యి రూపాయలకు పైగా అయిపోయింది. పైగా నాన్న తాగుబోతు. తాగి, తాగి.... ఆ చాకిరీలోనే చచ్చిపోయాడు." బోరున ఏడ్చింది ఆమె.

ఆపుకొని, మళ్ళీ చెప్పసాగింది. 'ఇంతలో పట్నంలో చదువు కుంటున్న కామందుగారి కొడుకు కుమార్‌బాబు ఈ ఊరు వచ్చాడు. ఇంటి పెత్తనం తీసుకుని, రోజూ నన్ను కూలికి రమ్మని సాధించే వాడు. లేక పోతే నాన్న చేసిన బాకీ తీర్చమని వేధించేవాడు. పేదవాళ్ళం. ఎప్పుడూ అంత డబ్బు చూడనైనా చూడని వాళ్ళం ఎక్కడ్నుంచి తెచ్చి కట్టను?"

ఇప్పుడీ ఘోర కృత్యానికి పాలుపడింది ఆ కుమార్‌బాబేనా?

"అవును.... అ.....ఆపండి! ఆపండి! అదుగో.... ఊరి చివరగా కని పించే ఆ చింత చెట్లు, ఆ చెట్ల మధ్యనే మా గుడిసె. ఇక్కడే దిగేస్తాను."

జీప్ ఆపాడు మురళీధర్.

ఆమె దిగింది.

"మీ టవల్ ....?"

"ఫరవాలేదు. తీసుకెళ్ళండి"

ఆమె చీకట్లో కలిసి పోయింది.

ఒక్క నిట్టూర్పు విడిచి, ఊర్లోకి జీప్‌ను పోనిచ్చాడు మురళీధర్.

మురళీధర్ పట్నంలో పెద్ద ఉద్యోగంలో వున్నా, చిన్నతనం అంతా పల్లెటూర్లోనే గడపడం వలన పల్లె పడుచునే వివాహం చేసు కోవాలన్న కోరిక పెంచుకున్నాడు.

ఆ కోరిక ఫలితమే ఈ వేళ కోటీశ్వరయ్యగారింటికి పెళ్ళిచూపులకు రావడం!

జంటగా వస్తానన్న స్నేహితుడు అర్జంటు పనిమీద హైదరాబాద్ వెళ్ళవలసి రావడంతో, ఒంటరిగా బయలుదేరక తప్పలేదు మురళీధర్‌కు.

దారిలో జీప్ కాస్త ట్రబుల్ యివ్వడంతో ఆలస్యమయింది. మధ్యలో ఈ కథ?

*　　　*　　　*

ఎర్రమట్టివాగు ఖండ్రిగ పల్లెటూరు అయినా, కోటీశ్వరయ్యకు మూడంతస్తుల మేడ అందంగా అతని హుందాను చాటి చెబుతూంది.

ఆరోజు మంచిరోజు కావడంతో విద్యుద్దీపాల వెలుగులో ఘనంగా పెళ్ళిచూపుల తతంగం జరిగిపోయింది. అమ్మాయి సలక్షణంగా వుంది. అబ్బాయికి నచ్చింది. ఇల్లంతా ఆనందంతో వెల్లివిరిసింది.

డిన్నర్ సమయంలో అప్పుడే పొలాలనుండి తిరిగి వచ్చిన తనయుని మురళీధర్‌కు పరిచయం చేశాడు కోటీశ్వరయ్య. "వీడు మా వాడు. కుమార్‌బాబు. ఈ అస్తి కంతటికీ కుమార్‌రాజా, పట్నంలో బి.ఏ. చదివాడు అయినా వీడికి సేద్యం అంటే చాలా యిష్టం. అందుకే పెత్తనం వాడికిచ్చేశాను."

ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని, ఆశ్చర్యపోయారు. ఆ ఆశ్చర్యం బహిర్గతం కానీయక అంతరంగంలోనే అణుచుకున్నారు.

*　　　*　　　*

మూడవ అంతస్తులో నాలుగవ గదిలో మురళీధర్‌కు విడిది ఏర్పాటు చేశారు.

మురళీధర్‌కు నిద్రపట్టడం లేదు. కుమార్‌బాబును ఏదో అడగనిదే మనసు కుదుట పడేటట్టు లేదు. అందుకే పనిమనిషితో కబురంపాడు.

తెల్లని బట్టల్లో, చేతిలో సిగరెట్ కేసుతో చిన్న జమీందార్‌లా ప్రవేశించి సోఫాలో కూర్చుని, మురళీధర్‌కు సిగరెట్ ఆఫర్ చేశాడు.

''నో....థాంక్స్'' అన్నాడు మురళీధర్.

"అదృష్టవంతులు" అంటూ ఓ సిగరెట్ ముట్టించుకుని, తృప్తిగా తాగసాగాడు కుమార్‌బాబు.

"మీతో మాట్లాడాలని పిలిపించాను." ప్రారంభించాడు మురళీధర్.

"ఏ విషయం?" విచిత్రంగా కనుబొమ్మలు పైకెత్తాడు కుమార్‌బాబు.

"నేనిక్కడికి వచ్చిన సందర్భానికీ, నేనిప్పుడు మాట్లాడే విషయానికీ సంబంధం లేదు. ఆ మాత్రం అర్థం చేసుకోగలరనుకుంటాను."

సోఫాలో జారగిలబడుతూ, దర్జాగా అన్నాడు కుమార్‌బాబు "చెప్పండి."

"ఆ అమ్మాయిని కూలికి పిలిచి అలా ఎందుకు చేశారు?"

ఫక్కున నవ్వాడు కుమార్‌బాబు.

విచిత్రంగా చూశాడు మురళీధర్.

''మరేదో అనుకున్నాను. అదా? ఆ కన్నీటి ముత్యాలు విషయమా?" కుమార్‌బాబు ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

"కన్నీటి ముత్యాలు' ఏమిటి?"

"అదే! ఆ కూలిపిల్ల. దాని పేరు ముత్యాలు. గదమాయిస్తే చాలు ... కన్నీళ్ళు పెట్టుకుంటుంది. అంత సున్నితం చిన్ననాటి నుంచి, అందుకే దాన్ని ఊళ్ళో అందరూ 'కన్నీటి ముత్యాలు' అని పిలుస్తూ వుంటారు. నేను మాత్రం ముద్దుగా 'ముత్యం' అని పిలుస్తాను." అతని గుండెల్లో కోరిక ఇంకా పొగలిడుస్తూనే వుంది.

"కుమార్‌బాబూ?" కాస్త తీవ్రత ధ్వనించింది మురళీధర్ కంఠంలో.

"శాంతించండి, బావగారూ!" తేలిగ్గా అన్నాడు కుమార్‌బాబు, "మిమ్మల్ని అక్కడ చూచి ఏ ప్రభుత్వం ఆఫీసరో అనుకున్నాను. ఇలా మా ఇంటికే విచ్చేస్తున్న కాబోయే బావగారు అని మాత్రం అనుకోలేదు. అయినా, బావగారూ మీరు రచయితలా?"

"ఏం?"

"అహా.... పేదవాళ్ళమీద ఎంతో సానుభూతి....

"కుమార్‌బాబూ?"

"ఆపండి ప్లీజ్! చెప్పేది వినకుండా ఎందుకలా ఉద్రేకపడతారు? ఇలాంటివి ఈ పల్లెల్లో సర్వ సామాన్యమయిన విషయాలు."

"నో.... నేనొప్పుకోలేను నేనూ పల్లెటూర్లో పుట్టి పెరిగినవాణ్నే".

"కావచ్చు ఇక్కడ పరిస్థితులు వేరు కావచ్చు"

"ఎందుకని?"

"పూర్తిగా వినండి. కన్నీటి ముత్యాలు అదే ముత్యం— నాన్న మాయింట్లో ఏళ్ళ తరబడి వెట్టిచాకిరీ చేసేవాడు. తాగి వాడు చచ్చాడు. దానమ్మకు ఎప్పుడూ జబ్బే, మంచాన ఉంటుంది. చెప్పినా వినకుండా ఒక్కకూతురని అల్లారుముద్దుగా పెంచి. హైస్కూల్లో చదివించారు ముత్యాన్ని. అది ఇంట్లో కులుకుతూ కూర్చుంటే, దానబ్బ చేసిన 'మా బాకీ ఎవరు తీరుస్తారు?' అది కూలికి రాకుంటే దానికి, మంచంలోవున్న దానమ్మకీ కూడెట్లా వస్తుంది? అందుకే కూలికి పిలిచాను."

"కూలికి పిలిచి చేసిందేమిటి?"

"ఇంకా అర్థం కాలేదా? దానిమీద నా కన్నుందనే, ఎవడూ ముందడుగు వెయ్యలేక పోతున్నాడు. నా అండే లేకపోతే దాన్నిపాటికి ఎందరో పంచుకుని వుందురు." సిగరెట్ ముక్క ఆ పక్కనే వున్న యాష్‌ట్రేలో నొక్కి, మరో సిగరెట్ ముట్టించుకున్నాడు, కుమార్‌బాబు గర్వంగా.

"ఇప్పుడు చెప్పండి, మా దయలేనిదే వారికి బతుకులేదు."

"వెట్టిచాకిరీ ప్రభుత్వం రద్దు చేసింది'' సూటిగా అన్నాడు మురళీధర్

'తెలుసు. కానీ, వీళ్ళకు మమ్మల్ని ఎదిరించే దమ్ము కావాలిగా?'

''విజ్ఞానులం, నాగరికులం, సంస్కారులం అనుకునే మనలో మానవత్వం ఏమయింది?''

అదోలా నవ్వాడు కుమార్‌బాబు.

''బావగారూ ఈ వాదన ముందుకు సాగడం నాకు ఇష్టం లేదు. మీరు మా బావగారు అయ్యాక అలాగే వాదించి నన్ను ఒప్పించండి. అయినా ఆ కూలి పిలను గురించి ఈ సందర్భంలో మనం మాట్లాడుకోవడం హాస్యాస్పదం. ఊరు మాటు మణిగింది. మరీ మాటాడితే మీకు నేను అసౌకర్యం కలిగించానని నాన్నగారు కోప్పడతారు. విశ్రాంతి తీసుకోండి." అంటూ లేచాడు కుమార్‌బాబు,

విస్మయంగా అతని దెస చూశాడు మురళీధర్.

"గుడ్‌నైట్!" అంటూ లైట్లు డిమ్‌చేసి, వెళ్ళిపోయాడు కుమార్‌బాబు.

''గుడ్‌నైట్'' అంటూ బెడ్‌మీద వాలాడు మురళీధర్.

'కన్నీటి ముత్యాలు' మదిలో మెదిలింది.

'బుద్ధదేవుడు పుట్టిన ఈ పుణ్యభూమిలో........' అనుకుంటూ కళ్ళు మూశాడు

* * *

మరునాడు ఉదయం వెళ్ళగానే ఉత్తరం వ్రాసి ఆ తరువాత పెద్దలను పంపుతానని' ప్రయాణం అయ్యాడు మురళీధర్.

ఊరి చివరికి వచ్చేటప్పటికి కన్నీటి ముత్యాలు గుర్తు వచ్చింది.

ఇంతలో చింతచెట్ల మధ్య గొల్లుమన్న ఏడుపులు.

జీప్ ఆపాడు.

అటే పోతున్న ఓ బక్కడొక్కను పిలిచి ఆ ఏడుపు లేమిటని అడిగాడు.

"కన్నీటి ముత్యాలు తల్లి సచ్చిపోయినాది" అంటూ వెళ్ళిపోయింది ఆ బక్కడొక్క.

మురళీధర్ మనసు చివుక్కుమంది.

"పోనీ ఒకసారి వెళ్ళివస్తే?" జీప్ దిగబోయాడు.

"మళ్ళీ రాహుకాలం వస్తుంది మీరు బయలుదేరండి" అప్పటికే అక్కడికి చేరుకున్న కుమార్‌బాబు హెచ్చరించాడు.

కిందకు దిగకుండానే. గేర్ మార్చి యాక్సిలేటర్‌మీద కాలు నొక్కాడు.

"భగవాన్! ఆ కన్యను రక్షించే భారం నీదే" అనుకున్నాడు మురళీధర్.

కాస్సేపటికి ఎర్రమట్టివాగు ఖండ్రిగను వదిలి వెళ్ళిపోయింది జీప్.

అనంతమైన ఆకాశం.

విశాలమైన భూభాగం.

లోకంలోని శోకం కుప్పగా రాసిపోసినట్లు ఆ గుడిసె.

బయట అంతా వెన్నెల.

ఆ గుడిసెలో మాత్రం చీకటి.

"అమ్మ" ఆఖరి శ్వాస వదిలినచోట.... ఆ క్షణమో మరో క్షణమో చనిపోయే ముందు సిద్ధంగావున్న మట్టి ప్రమిదలో బిక్కు బిక్కు మంటున్న దీపం.... ఆ గుడిసె చీకటిని పారదోలలేక ఓడిపోయింది.

అంధకారం, భయంతో పూర్తిగా నిండిపోయిన గుండెతో ముత్యాలు గుడిసె మధ్యగా ముడుచుకుని పడుకుని వుంది.

గుడిసె వెలుపల అడుగుల సవ్వడి.

చూపును తడిచేస్తున్న కన్నీటి ధారలను తుడుచుకుంటూ, తలఎత్తి చూసింది ముత్యాలు.

గుడిసె ముందర రెండు జతల పాదాలు.

ఒక జత నల్లగా వున్నాయి. మరో జత తెల్లగా వున్నాయి. ముత్యాలు కనుబొమ్మలు ముడిపడ్డాయి. గుండె మరింత వేగంగా కొట్టుకోసాగింది.

"దిక్కెవరు?" ఆమెలో ఘోష తీవ్రమయింది.

అలజడి ఎక్కువయింది. అంతులేని వ్యధ ఆమె ఎదను పిండి వేయసాగింది.

వెలుపల కాళ్ళు కలియబడ్డాయి తొక్కులాడుకున్నాయి. నల్లని పాదాలు పక్కకు నెట్టివేయబడ్డాయి. తెల్లని పాదాలు ముందుకు వచ్చాయి.

ఆ పాదాలు వెన్నముద్దల్లా వున్నాయి.

కరుణకు ప్రతినిధుల్లా వున్నాయి.

ముత్యాలు కళ్ళు బెదురుతూనే ఎదురు చూశాయి.

'ముందుకు వచ్చిన ఆ పాదాలు జీపులోని బాబువి. అయితే?'

ఎవరిదో నిలువెత్తు విగ్రహం. అర్థం కావటం లేదు. కన్నీటి తెరల పొరలు

స్పృహ తప్పిపోయింది కన్నీటి ముత్యాలు. ❋